www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శనివారం
24.10.2026



- సైంటిస్టులా బాధ్యతారహితంగా మాట్లాడారు
- విపత్తులపై ప్రజలను హెచ్చరించడం ప్రభుత్వ బాధ్యత
- కాంగ్రెసే కరవు తెచ్చిందనడం హాస్యాస్పదం
- ప్రజా సంక్షేమంపై రాజకీయం తగదు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

4 లో



కరోనా సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడిన బాధ్యతారహిత మాటలు నమ్మి ప్రజలు ప్రాణాలు కోల్పోయి శ్మశానాల పాలయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విపత్తుల వేళ ప్రజలను హెచ్చరించి అప్రమత్తం చేయడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, రాష్ట్రంలో నెలకొన్న కరవు ముప్పుపై తాము ముందుగానే మేల్కొలిపితే కాంగ్రెస్ ప్రభుత్వమే కరవు తెచ్చిందంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. విపత్తులను సైతం రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు.

- కలంజ్యోతి, హైదరాబాద్

కేసీఆర్ మాటలతో ప్రాణాలు పోయాయి



మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి

- కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత
- ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారు
- కాంగ్రెస్‌కు యువత బుద్ధి చెబుతుంది
- ఎన్నికలు పెట్టే ధైర్యం లేదు
- మరో ఏడాదే రేవంత్ హడావుడి
- కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

4 లో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పరిపాలనలో విఫలమైన ప్రస్తుత ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టేందుకు సైతం భయపడుతోందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను, యువతను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. - కలంజ్యోతి, హైదరాబాద్



30న పీఎం కిసాన్ నిధులు జమ

దేశవ్యాప్తంగా పీఎంకిసాన్ సమ్మాన్ నిధి పథకం లబ్ధిదారుల ఎదురుచూపులకు తెరదించుతూ కేంద్ర వ్యవసాయ శాఖ కీలక ప్రకటన చేసింది. పథకం 24వ విడత నిధులను అక్టోబర్ 30న అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించింది. విడతకు రూ.2 వేల చొప్పున పెట్టుబడి సాయం అందనుండగా, రైతులు ముందుగానే తమ ఈకేవైసీ, ఆధార్ అనుసంధానం, భూ రికార్డుల ధ్రువీకరణను సరిచూసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 23) : దేశవ్యాప్తంగా పీఎంకిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారుల నిరీక్షణకు తెరపడింది. పథకం 24వ విడత నిధులను అక్టోబర్ 30న విడుదల చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అధికారికంగా ప్రకటించింది. అర్హులైన ప్రతి రైతు కుటుంబం బ్యాంకు ఖాతాలో రూ.2 వేల చొప్పున నేరుగా జమ కానున్నాయి. రైతులకు ఏటా రూ.6 వేల ఆర్థిక సాయాన్ని మూడు విడతల్లో ఒక్కో విడతకు రూ.2 వేల చొప్పున డీబీటీ పద్ధతిలో కేంద్రం అందజేస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 20న పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ వేదికగా ప్రధాని మోదీ 23వ విడత నిధులు విడుదల చేయగా, 9.44 కోట్ల మంది రైతులకు రూ.18,880 కోట్లు అందాయి. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి

మిగతా 4లో..



మా జెండా తంగేడు పువ్వు రంగు

తమ పార్టీది పసుపు జెండా కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన తంగేడు పువ్వు రంగు జెండా అని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మియాపూర్‌లో నిర్వహించిన రాజధాని రణభేరి సభలో ఆమె మాట్లాడుతూ.. ఆర్భాటపు సమ్మిట్‌ల పేరిట రైతుల భూములను లాక్కుంటూ సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం లబ్ధి పొందుతోందని, యువతకు నిజమైన ఉద్యోగాలు కల్పించే ఐటీ పాలసీలు తేవాలని డిమాండ్ చేశారు. వచ్చే బల్దియా ఎన్నికల్లో గెలిచి నగరంలోని ప్రతి డివిజన్‌లో ఆస్పత్రి నిర్మిస్తామని ఆమె ప్రకటించారు.

- ఉద్యోగాలు ఇచ్చే పాలసీలు కావాలి
- సమ్మిట్‌ల పేరుతో భూములు లాక్కుంటున్నారు
- బల్దియా ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
- టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 23) : తమ పార్టీది పసుపు జెండా కాదని, తెలంగాణ ఆత్మ గౌరవ ప్రతీక అయిన తంగేడు పువ్వు రంగు జెండా అని టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత అన్నారు. మియాపూర్ నరేన్ గార్డెన్స్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ రాజధాని రణభేరి సభలో ఆమె మాట్లాడారు. తంగేడు పువ్వు జెండా కోసం నిరంతరం కష్టపడే కార్యకర్తలే భవిష్యత్తులో ఎంపీలు, ఎమ్మెల్యేలు అవుతారని తెలిపారు. హైదరాబాద్ నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఐటీ ఉద్యోగుల మేధస్సు

మిగతా 4లో..

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
శనివారం 24.10.2026
www.kalamjyothi.com



నాణ్యమైన విద్య అందిస్తాం

విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 23) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో డిజిటల్ విద్య, కృత్రిమ మేధస్సు నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పోషకాహారం అందిస్తూ సర్కారు బడులను కార్పొరేట్ సంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతోనే డిజిటల్ విద్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నైపుణ్యాలను పాఠశాలల్లో పరిచయం చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ప్రస్తుత తీవ్ర పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించడం ఎంతో అవసరమని సూచించారు. గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యావకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని, డిజిటల్ సదుపాయాలు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచి ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

వ్యవసాయ అధికారి నాగరాజు



కలంజ్యోతి, నెక్కొండ (అక్టోబర్ 23) : రైతులు వ్యవసాయ భూములను కాపాడుకుంటూ ఎల్ నినో ప్రభావం దృష్ట్యా యాసంగిలో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. రెడ్లవాడ గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల వల్ల యాసంగిలో రైతులు వరి సాగును తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ. నాగరాజు సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా కేవలం రెండు మూడు తడులతో పండే శనగ, వేరుశనగ, నువ్వులు, పెసర, మినుములు, జొన్న, ఆముదం, కూరగాయలు వంటి పంటలు సాగు చేయాలని కోరారు. వరికి ఉపయోగించే నీటిలో కేవలం 1020 శాతం నీటిని మాత్రమే వినియోగించుకుని, వరికి సమానంగా ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ ఆవుల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ దగ్గు సంతోష్ గాంధీ, ఉప సర్పంచ్ మేకల ప్రవీణ్, ఏవో ఏ. నాగరాజు, ఏఈవో అరవింద్, పీఏసీఎస్ సీఈవో ఎం. సురేష్, గ్రామ రైతులు మూల రవి, బాధవత్ బాలాజీ, జి. సాంబయ్య, రమణయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బావి వద్ద విద్యుత్ సామగ్రి చోరీ..



కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 23) : వల్లంపట్ల గ్రామంలో రైతు పందిల్ల సురేష్‌కు చెందిన వ్యవసాయ బావి వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ సామగ్రిని ఎత్తుకెళ్లారు. బావి వద్ద ఉన్న సుమారు 25 గజాల విద్యుత్ వైరు, స్టార్టర్, ఫ్యూజులను అపహరించడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ పనులకు అవసరమైన కీలక సామగ్రి చోరీ కావడంతో బాధితుడు ఆందోళన చెందుతున్నాడు. గ్రామ పరిసరాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిఘా పెంచి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.



లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 23) : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ సమావేశంలో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ, ప్రభుత్వ నిబంధనల అమలుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా 13 ప్రైవేట్ ఆస్పత్రులు, 6 స్కానింగ్ కేంద్రాలకు అనుమతులు మంజూరు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, లింగ నిష్పత్తి మెరుగుదలకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వైద్య సంస్థలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



జనగణన విధులు బాధ్యతగా చేపట్టాలి

కచ్చితత్వం, పారదర్శకత పాటించాలి

కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 23) : జనగణన ప్రక్రియలో అధికారులు కచ్చితత్వం, పారదర్శకతతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, మండల విద్యాశాఖ అధికారులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ అభివృద్ధికి, సంక్షేమ పథకాల రూపకల్పనకు జనగణన సమాచారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సుజాత, మాస్టర్ ట్రైనర్లు శివరామకృష్ణ, రిషిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 23) : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్ విద్యార్థులకు ఠాణాలో నిర్వహించే రోజువారీ విధులు, వివిధ చట్టాలు, నేరాల దర్యాప్తులో ఫింగర్ ప్రింట్ డివైస్ వినియోగం, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమగ్రంగా వివరించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
శనివారం 24.10.2026
www.kalamjyothi.com

రేవంత్‌రెడ్డి ప్రజలకే అన్యాయం చేస్తుండు

- ఉద్యమానికి సంపూర్ణ మద్దతిస్తాం
- బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- జవహర్‌నగర్ డంప్‌యార్డ్ తరలింపు ఉద్యమం పాదయాత్ర సన్నాహక మీటింగ్



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 23) : రాజకీయంగా అండగా నిలిచి, సీఎం కావడానికి సహకరించిన ప్రజలకే రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. జవహర్‌నగర్ డంప్‌యార్డ్ తరలింపు ఉద్యమం, పాదయాత్ర సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టనున్న ప్రజా పోరాటానికి బీజేపీ శాసనసభా పక్షం (బీజేఎల్పీ), పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులంతా ఈ ఉద్యమంలో భాగస్వాములవుతారని స్పష్టం చేశారు.

ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన జీవించే హక్కులో భాగంగా ప్రజలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో ప్రజలకు ఈ కనీస హక్కును కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. నిత్యం రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిన ప్రజలే నేడు జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఆరోగ్యం, హక్కులను కాపాడాల్సిన బాధ్యత సీఎంకు లేదా అని నిలదీశారు.

శాశ్వత పరిష్కారం చూపేందుకు పోరాటం..

సుమారు 30 ఏళ్లుగా జవహర్‌నగర్ డంప్‌యార్డ్ కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర నరకం చూస్తున్నారని ఏలేటి తెలిపారు. రోజుకు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకుపోతుండటంతో ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతోందని, గత, ప్రస్తుత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే సమస్య పరిష్కారం కాలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అనేక ప్రజా సమస్యలపై పోరాడిన అనుభవం ఉన్న ఈటల రాజేందర్ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించడం బాధితుల్లో కొత్త ఆశలు నింపిందన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపునకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ఫోరమ్‌కు సర్పంచ్ కాత మల్లేశం లేఖ

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 23) : రేపాక గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కాత మల్లేశం ఉత్తర తెలంగాణ TSNPDCL కన్జ్యూమర్ ఫోరమ్ అధికారులకు అధికారికంగా లేఖ అందజేసి ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద ఉన్న 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న అంతరాయాలను సరిదిద్దాలని కోరారు.

అర్బన్ విద్యుత్ సరఫరా అందించాలి..

పంచాయతీ పరిధిలో ప్రమాదకరంగా మారిన, వంగిన విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామానికి అర్బన్ విద్యుత్ సరఫరా సౌకర్యాన్ని కేటాయించి, గ్రామ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు. సంబంధిత ఉన్నతాధికారులు త్వరితగతిన స్పందించి సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కాత మల్లేశం విజ్ఞప్తి చేశారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాహిత్య వినయ్

వైస్ చైర్మన్‌గా భరత్‌రెడ్డి

రైతుల సంక్షేమానికి కృషి చేస్తాం : సాహిత్య

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 23) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం అధికారికంగా నియమించింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇల్లంతకుంటకు చెందిన సాహిత్య వినయ్ కుమార్, వైస్ చైర్మన్‌గా రేపాక గ్రామానికి చెందిన భరత్ రెడ్డి నియమితులయ్యారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతో నూతన పాలకవర్గం ఏర్పాటవడంపై స్థానిక ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి పాటుపడతాం..

నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా అనంతారం గ్రామానికి చెందిన బదుగు లింగం, కందికట్కూర్‌కు చెందిన వెలిశాల జ్యోతి, గాలిపల్లి (జువారిపేట)కు చెందిన జెట్టి మల్లేశం, ముస్కానిపేట (పత్తికుంటపల్లె)కు చెందిన జుట్టు నగేష్, సోమర్‌పేట (జంగంరెడ్డిపల్లె)కు చెందిన మంద బాల్‌రెడ్డి, అనంతగిరి (సిరికొండ)కు చెందిన మల్లయ్య, దాచారానికి చెందిన వాడే శ్రీనివాస్ రెడ్డి, పెద్దలింగాపూర్‌కు చెందిన మాతిరెడ్డి నవీన్ రెడ్డి, వల్లంపట్ల (కిష్టారావుపల్లె)కు చెందిన బంగారి అంజయ్య, ఓగులాపూర్‌కు చెందిన ఎరుకల తిరుపతి నియమితులయ్యారు.



రైతులకు మెరుగైన సేవలందిస్తాం..

నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు పాలకవర్గ సభ్యులు రైతుల సమస్యల పరిష్కారానికి, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి, రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. చైర్మన్‌గా సాహిత్య వినయ్ కుమార్, వైస్ చైర్మన్‌గా భరత్ రెడ్డి నియమితులు కావడంతో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వారికి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



ఉచిత చెస్ట్ ఎక్స్‌రే క్యాంపు

కలంజ్యోతి, ఇల్లంతకుంట : టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏంజెలినా ఆల్ఫ్రెడ్ ఆదేశాల మేరకు మండలంలోని గాలిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పల్లె దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత చెస్ట్ ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు. శిబిరంలో ముప్పు ఎక్కువగా ఉన్న 65 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు చేసి, ముగ్గురు అనుమానితులను గుర్తించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. టీబీ లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని, ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ కట్ట రమేష్, గ్రామ సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి, సూపర్‌వైజర్ జవహర్, టీబీ సూపర్‌వైజర్లు జేత్య, మహిపాల్, గంగాధర్, ఎక్స్‌రే టెక్నీషియన్ బాలు, ఐసీటీసీ కౌన్సిలర్ గంగయ్య, జిల్లా ఛాంపియన్ నాగరాజు, ఏఎన్ఎం కవిత, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సేవలను స్మరించుకోవాలి

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

ఎస్పీ మహేష్ బి. గితే

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 23) : ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా సిరిసిల్ల పట్టణ ఠాణాలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసుల విధులు, శాంతిభద్రతల పరిరక్షణ, ఠాణా పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పగలు, రాత్రి గస్తీ, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల దర్యాప్తు ప్రక్రియలను ప్రత్యేక స్టాళ్ల ద్వారా విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

నేరస్తులను గుర్తించే సాంకేతికత, సీసీ కెమెరాల ప్రాధాన్యత, షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను అధికారులు వివరించారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్ డ్రైవింగ్ చేయకూడదని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గణేష్, అనిల్, రంజిత్, ఆర్ఎస్ఐ సాయికిరణ్, వివిధ విభాగాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





ఎక్సైజ్ సీఐతో గౌడ నేతల భేటీ

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 23) : మండల గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ సీఐని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పందిర్ల శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కోల నారాయణ గౌడ్, నాయకుడు నేరెళ్ల సత్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శనివారం 24.10.2026
4
www.kalamjyothi.com



తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

తాగునీటికే ప్రాధాన్యం ఇవ్వాలి

కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 23) : రానున్న రోజుల్లో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, నీటిపారుదల, భూగర్భ జల శాఖల అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నందున నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నార్లాపూర్, ఎల్లూరు రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే ప్రాధాన్యమివ్వాలని, వ్యవసాయానికి నీటి సరఫరాపై రైతులకు ఎలాంటి హామీలు ఇవ్వవద్దని స్పష్టం చేశారు.

లీకేజీలను వెంటనే అరికట్టాలి..

ఎల్లూరు నుంచి కేఎల్ఐ పంపుసెట్ల ద్వారా తాగునీటి సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుతం 57 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, డెడ్ స్టోరేజీ 30 టీఎంసీలుగా ఉందని పేర్కొన్నారు. నీటి పొదుపుపై గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల ఈఈలు, డీఈలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 23) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, అన్నివర్గాల ప్రజలు తిరిగి బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో పూర్తిగా విఫలమైందని, గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు మొదలయ్యాయని, తాగునీటి సమస్య తీవ్రమై వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని మండిపడ్డారు. మరో ఏడాది మాత్రమే రేవంత్‌రెడ్డి హడావుడి ఉంటుందని, ఆ తర్వాత రాజకీయ పరిణామాలు మారి కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమని స్పష్టం చేశారు.

ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం విఫలం..

ఎల్‌నినో ముప్పుపై తాము పది నెలల ముందే అప్రమత్తం చేసినా సర్కారు మేల్కొనలేదని కేటీఆర్ ఆరోపించారు. పొరుగు రాష్ట్రాలు జాగ్రత్తపడి ప్రాజెక్టులను నింపుకుంటే, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరించిందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం పంపులు నడిపిస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే రేవంత్‌రెడ్డి సర్కారు వాటిని ప్రారంభించలేదని విమర్శించారు. మేడిగడ్డపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని, రాహుల్‌గాంధీని తీసుకొచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచి ప్రచారం వరకు శ్రేణులు సమన్వయంతో కదలాలని, ధనబలాన్ని నమ్ముకున్న కాంగ్రెస్‌కు నిరుద్యోగులు, యువత తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు భయపడుతున్నారు..

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీఆర్ఎస్ విజయ కేతనం ఎగురవేస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. నిరుద్యోగులను యూత్ డిక్లరేషన్ పేరుతో మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో లూటీ పాలన సాగుతోందని, పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రయోజనాల కోసం కాకుండా కాంగ్రెస్, బీజేపీ నేతలు పరస్పరం సహకరించుకుంటూ కేసీఆర్, కేటీఆర్‌లను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న బీజేపీకి కాంగ్రెస్ ప్రత్యామ్నాయం కాలేదని, జాతీయ స్థాయిలో కేసీఆర్ చెప్పిన కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి ఆవశ్యకతను ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు.

కేసీఆర్ మాటలతో ప్రాణాలు పోయాయి



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 23) : కరోనా మహమ్మారి సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహరించిన తీరు అత్యంత బాధ్యతారహితంగా ఉందని, ఆయన మాటలు నమ్మి ప్రజలు ప్రాణాలు కోల్పోయి శ్మశానాల పాలయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విపత్తుల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన కనీస బాధ్యతను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. 2019లో కరోనా వ్యాప్తి చెందిన సమయంలో కేసీఆర్ తానేదో ఒక శాస్త్రవేత్తలా భావించుకుని మాట్లాడారని, ఆ నిర్లక్ష్యపు మాటల వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారని మండిపడ్డారు.

కాంగ్రెసే కరవు తెచ్చిందనడం హాస్యాస్పదం..

రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత కరవు పరిస్థితులపై స్పందిస్తూ, గత ఆరు నెలలుగా కరవు ముప్పు పొంచి ఉందని తమ ప్రభుత్వం ప్రజలను, యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూనే ఉందని సీఎం గుర్తుచేశారు. ప్రకృతి విపత్తులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ప్రజా ప్రభుత్వ ప్రాథమిక విధి అని స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ కరవును సృష్టించిందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు వంటి బాధ్యతాయుత స్థానాల్లో పనిచేసిన నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

ప్రజా సంక్షేమంపై రాజకీయం తగదు..

విపత్తుల పట్ల తమ ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ముందస్తు చర్యలు చేపడుతుంటే, బీఆర్ఎస్ నాయకులు ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం తగదని హితవు పలికారు. కష్టకాలంలో ప్రజల ప్రాణాలను, ప్రయోజనాలను కాపాడటం కంటే చిల్లర రాజకీయాలు చేయడమే వారికి అలవాటుగా మారిందని విమర్శించారు. సంక్షోభ సమయాల్లో రాజకీయ విమర్శలు మాని, ప్రజలను కాపాడే ప్రయత్నాలకు సహకరించాలని స్పష్టం చేశారు.



మా జెండా తంగేడు పువ్వు రంగు

▶▶ మొదటిపేజీ తరువాయి

కు, ప్రతిభకు సెల్యూట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అటు కేంద్రంలోగానీ, ఇటు రాష్ట్రంలోగానీ సరైన సమగ్ర ఐటీ పాలసీ లేకపోవడం శోచనీయమని విమర్శించారు.

సమ్మిట్‌ల పేరుతో భూములు లాక్కుంటున్నారు..

రాష్ట్రానికి ఆర్భాటపు నకిలీ సమ్మిట్‌లు వద్దని, యువతకు నిజమైన ఉద్యోగాలు, ప్రజలకు ఉపాధి కల్పించే స్పష్టమైన కార్యక్రమాలు కావాలని కవిత డిమాండ్ చేశారు. సమ్మిట్‌ల పేరిట రైతుల భూములను లాక్కుంటూ, యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం సేకరించిన భూములన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి పేరిట చేర్చుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను కచ్చితంగా అడ్డుకుంటామని హెచ్చరించారు.

బల్దియా ఎన్నికల్లో గెలుపే లక్ష్యం..

రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తామే గొప్పవాళ్లమని చెప్పుకుంటున్నాయని, అడవిలో సింహాలు ఎన్ని ఉన్నా వేటగాడు ఒక్కడే ఉంటాడని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజా వ్యతిరేక పార్టీలన్నింటినీ బోనులో బంధించే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి వెయ్యి ఓట్లకు ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేసే ప్రభుత్వాలు, ప్రజల ఆరోగ్యం కోసం ప్రతి వెయ్యి మందికి ఒక ఆస్పత్రిని, మందులను ఎందుకు అందుబాటులో ఉంచవని ప్రశ్నించారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ బల్దియా ఎన్నికల్లో టీఆర్ఎస్ జెండా ఎగరేస్తామని, నగరంలోని ప్రతి డివిజన్‌లో అత్యాధునిక ఆసుపత్రిని నిర్మించి నిరంతరం 24/7 వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.

30న పీఎం కిసాన్ నిధులు జమ

▶▶ మొదటిపేజీ తరువాయి

రూ.60,000 కోట్లు కేటాయించగా, తాజా విడుదలతో రైతులకు పెట్టుబడి అవసరాలకు ఊరట లభించనుంది.

ఈ-కేవైసీ తప్పనిసరి..

లబ్ధిదారులు నిధులు పొందడానికి ముందుగానే తమ ఖాతా స్థితిని పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. ఈకేవైసీ ప్రక్రియతోపాటు బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం, భూరికార్డుల ధ్రువీకరణ సరిగా ఉండేలా చూసుకోవాలి. ఈకేవైసీని అధికారిక పోర్టల్, మొబైల్ యాప్ లేదా సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్లలో పూర్తి చేసుకోవచ్చు. అధికారిక పోర్టల్‌లోని 'నో యువర్ స్టేటస్' ద్వారా చెల్లింపుల వివరాలు, బెనిఫిషియరీ లిస్ట్ ద్వారా జాబితాలో తమ పేరును ధ్రువీకరించుకోవచ్చని అధికారులు తెలిపారు.

సమస్యలుంటే

వ్యవసాయ అధికారులను కలవాలి..

భూ వివరాలు, ఈకేవైసీ లేదా అర్హతలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలి. పీఎం కిసాన్ అధికారిక



ఖాతా ద్వారా తేదీ ప్రకటన వెలువడినప్పటికీ, ప్రధాని ఏ వేదిక నుంచి నిధులు విడుదల చేస్తారనే వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. రబీ సాగు పనులు ప్రారంభమవుతున్న వేళ ఈ ఆర్థిక సాయం అందనుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

'సముక్'లో రుక్మిణి మైత్ర

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఇప్పటివరకు చేయని సరికొత్త జోనర్‌లో ఏలియన్ సర్వైవల్ యాక్షన్ థ్రిల్లర్ 'సముక్' చిత్రంలో నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా నిర్మిస్తున్న ఈ చిత్రానికి కనిష్క వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ క్రియేచర్, స్టంట్ టీమ్‌లతో భారీ హంగులతో గ్లోబల్ ప్రొడక్షన్ స్థాయిలో షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో అక్షయ్ కుమార్ సరసన కథానాయికగా రుక్మిణి మైత్రా ఎంపికైనట్లు చిత్ర నిర్మాణ సంస్థ సన్ షైన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. గతంలో 'సనక్' చిత్రంలో నటించిన రుక్మిణి, మరోసారి ఈ సంస్థతో కలిసి పనిచేస్తుండటం పట్ల మేకర్స్ సంతోషం వ్యక్తం చేశారు. మిలిటరీ రియలిజం, సర్వైవల్ హర్రర్, ఏలియన్ మైథాలజీ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.